# మేరేజస్సార్ మేడిన్‌హెవెన్.

శ్రీ రచన: గోగుల జగన్నాథరావు (శ్రీపద్మ)

(గత సంచిక తరువాయి)

"ఆపేరు పాపుకివ్వండి! అంతేకాని, మీ టైం ఆగిపోయిందని, నన్ను టైం అడిగితే నేనెట్లా చెప్పగలను? అనికూడ అనకుండా వింతచూపొకటి చూసి చురుగ్గా నడచివెళ్ళిపోయిందామె.

మధు నిలువుగా నీరుగారిపోయాడు, ఆమె మాట్లాడకపోయేసరికి కేపెలాగయినాసరే ఆమె పేరు తెలుసుకోవాలని అనుకున్నాడు.

మధు ఆఫీసులో పనిచేస్తున్నాడన్నమాటే కాని, మనసుమాత్రం తను చూసిన ఆ సుందరాంగిపైనేవుంది. చేతులు యాంత్రికంగా కదలిపోతున్నా, మెదడుమాత్రం వాటిపై పనిచేయడంలేదు.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు అడిగాడు విజయ్.

"ఏమిటి మధు! ప్రతిరోజూ ఆఫీసుకు కాస్తలేటుగా వస్తున్నావ్? ఈరోజంతా దేనిగురించో అలా ఆలోచిస్తూనేవున్నావ్"

"అబ్బే ఏంలేదు విజయ్! ఈ రెండురోజులుబట్టీ ఒంట్లో కాస్త బాగాలేనట్లు బద్ధకంగావుంది, అంతే మరేంకాదు"

విజయ వెళ్ళిపోయాడు. మధు తనగదిలో అడుగు పెట్టాడు. టేబిలుముందుకూర్చున్నాడు. ఏమీ వుబుసుపోవటంలేదు. తనకు ప్రొద్దున్న ఆమె చూసిన చురుకైన చూపే తన హృదయానికి, మెత్త మెత్తగా తగలుతోంది. ప్రక్కనున్న మాగజైన్సుతీసి తిరగేయసాగాడు. వాటి మీద కూడ తన మనసు లగ్నంకావటంలేదు. కాగితం కలం తీసుకుని ఏదేదో పిచ్చిగారాయసాగాడు.

ప్రతి వుదయంలాగే ఆ వుదయంకూడా ఆమెరాక కోసం ఎదురు చూసాడు మధు. ప్రతిరోజు ఏడున్నరకి ప్రత్యేక్షమయ్యే ఆమె, ఆరోజు ఎనిమిది, తొమ్మిది, పది దాటిందికాని ఎక్కడా వచ్చిన జాడలేదు. ఆమె ఎందుకారోజు రాలేదో అర్ధంకాలేదు మధుకు.

వరుసగా మూడురోజులు గడచిపోయినయ్! కాని ఆమె ఆ దారిన రాలేదు. ఆమె కనిపించకపోయేసరికి, మ్రాన్పడిపోయాడు మధు. ప్రతి వుదయం ఆమెకోసం ఆశతో ఎదురు చూసాడు. కాని ఫలితం శూన్యం.

ఆ రోజు విజయ్ వాళ్ళయింటిలో హడావుడిగావుంది. అన్నదమ్ములు ముగ్గురు ఆనందంగావున్నారారోజు. కొద్దిసేపట్లో విజయ్ చెల్లెలు రాధను చూసుకునేందుకు పెళ్ళివారొస్తున్నారు. గదిలో విజయ్ అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇద్దరు వదినలూ రాధను ముస్తాబు చేయిస్తున్నారు దగ్గరుండి. పెళ్ళివారు రానేవచ్చారు. వాళ్ళకు ఘనస్వాగతం పలికి మర్యాధలన్నీ బాగానే చేసారు. వాళ్ళు రాధనుచూచి నచ్చినట్లు యిష్టపడ్డారు. పెళ్ళికొడుకయితే వేరే చెప్పక్కర్లేదు. అతని మనసు ఆనందంతో వువ్విళూరింది. రాధ అందాన్ని చూసి.

"అమ్మాయి మాకందరకు నచ్చినట్లే ఇక పోతే కట్నం విషయం .. " అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి. ఎంత కావాలో అడగమన్నారు విజయ్ ఇద్దరన్నలూ.

"మొన్నో సంబంధంవచ్చింది. పదివేలిస్తానన్నారు. కాని మాకా అమ్మాయినచ్చలేదు" మధ్యవర్తి పలికాడు.

"ఎనిమిదివేలయితే యిచ్చుకోగలం"

"సరే! మాకు మీరాధ నచ్చింది ఇక కట్నాలదగ్గర బేరమెందుకు?" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

ఆలస్యం ఎందుకని అ రోజే తాంబూలాలుకూడా పుచ్చుకున్నారు.

"మీరు ముహూర్తం ఎప్పుడు నిశ్చయిస్తే, అప్పుడే మేం కూడా సిద్ధం, పెళ్ళి ఎంత త్వరగా జరిపించితే అంత

మంచిది. ఆ తరువాత మీయిష్టం" అని పెళ్ళివారు వెళ్ళిపోయారు.

సగం గుండె బరువుదిగింది అన్నదమ్ములు ముగ్గురికీ. ఆ తరువాత కొద్ది రోజుల్లోనే ముహూర్తం నిశ్చయం చేసారు.

★ ★ ★

"మాయింటికి రమ్మంటే, ఎలాగోతప్పించుకున్నావ్ ఈసారి ఏలా తప్పించుకుంటావు హై డియర్ మధు!" వెడ్డింగ్ కండిస్తూ అన్నాడు విజయ్.

"ఇదేమిటి?"

"మా చెల్లెలు? మేరేజ్ వచ్చే రెండో తేదీన"

"అలాగా!"

"ఏమిటో మధు! ఈమధ్య కొంచెం మారినట్లున్నావ్! ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగులుగా వుండటం గమనిస్తూనేవున్నాను."

"అబ్బే అలాంటిదేం లేదు విజయ్! ఆ మధ్య చెప్పానుగా, ఒంట్లో కాస్త బాగాలేదని. అంతే, మరేంలేదు"

"సరే, నేపోతున్నాను: పెళ్ళిరోజున వుదయాన్నే ఆఫీసుకు శెలవుపెట్టి వచ్చేయి. నీకోసమే ఎదురు చూస్తూంటాను. వస్తావుకదూ? నేనే వచ్చితీసుకెళదామంటే క్షణంతీరిక లేకుండావున్నాను. అందునా పెళ్ళి చాలా దగ్గరలో నిశ్చయించామొకటి."

"అలాగే విజయ్! తప్పకుండా వస్తాను. ఈ మధ్య మావూరువెళ్ళాలనుకుంటున్నాను. మీ చెల్లి పెళ్ళి చూసే వెడతానులే".

"వస్తాను" అని వెళ్ళిపోయాడు విజయ్.

★ ★ ★

ఆరోజు విజయ్ చెల్లెలుకి పెళ్ళిరోజు. విజయ్ చెప్పినట్లుగా వుదయాన్నే వాళ్ళింటికి వెళ్ళడానికి మధుకి కుదరలేదు. సెలవుకూడా యివ్వలేదు, ఆఫీసులోపని ఎక్కువగా వుండటంవలన, త్వర త్వరగా ఆఫీసుపని ముగించుకుని, విజయ్ ఇంటికేపునడిచాడు మధు. వీధి చివర యింటిముందు పెండ్లి పందిరివేసి వుండటంతో ఇంక ఎవ్వరినీ అడగనక్కర లేకపోయింది మధుకు "తొలివలపే తీయనిది. మదిలో మిగిలిన గాయమది" అన్న సారో సాంగు మైకుద్వారా వినవస్తోంది.

పందిట్లోనే విజయ్ ఎదురువచ్చాడు. "ఏమిటి యిప్పటివరకూ వుండిపోయావ్ వుదయమే రమ్మంటే".

"పని ఎక్కువగా వుంది విజయ్! అందుకే రాలేకపోయాను" అన్నాడు మధు.

విజయ్ కుర్చీతెచ్చి పందిట్లో వేసి కూర్చోబెట్టాడు మధును. తను తెచ్చిన ప్యాకెట్ అందించాడు విజయ్‌కు మధు.

పంతులుగారు మంత్రాలు చదువుతున్నారు. ఇంతలో-

"ఆపండా పెళ్ళి" పెళ్ళికొడుకు తండ్రిగొంతు ఖంగుమంది. అందరూ అటు చూసారు.

"వరా! ఇంకా చూస్తావే? యీ బోడి సంబంధం ఎవడిక్కావాలి" ఏమిటన్నట్లూ చూసాడు పెళ్ళికొడుకు,

"ఏమండీ! అల్లరి చేయకండి! మాకుటుంబ గౌరవాన్ని నడివీధిలో పెట్టకండి" ప్రాధేయంగా అన్నాడు విజయ్ పెద్దన్న కృష్ణ.

"చాలు చాలులేవయ్యా! మర్యాదట, మర్యాద. మీ నాన్నకి కుష్ఠువ్యాధి వుందని ముందే చెప్పితే, మేం యింకో సంబంధం చూసుకునే వాళ్ళంగా ... ఇప్పటికైనా మించిపోయిందిలేదు లేవరా అబ్బాయి" గర్జించాడు. పెళ్ళికొడుకు పీటపై నుంచి లేచాడు. చరచరా వెళ్ళిపోయాడు.

తనకీ జన్మలో పెళ్ళి ప్రాప్తి లేదనుకుని గదిలోనికి పారిపోయింది రాధ. తృప్తిలో అన్నీ సర్దుకున్నారు పెళ్ళివారు. ఈ గొడవవిన్న బలరాంగారు బయటకు వచ్చారు. అనేకవిధాలుగా పెళ్ళికొడుకు తండ్రిని ప్రాధేయపడ్డారు. అతను చీదరించుకున్నాడు, బలరాంగారి వికృతిరూపాన్ని చూసి. ఆయున్ని చూసి, పెళ్ళి పందిట్లోవున్న చాలామంది అసహ్యించుకున్నారు.

ఎన్నివిధాలుగా మొరపెట్టుకున్నా పెళ్ళివారు వెళ్ళిపోయారు.

"మిమ్మల్ని బయటకు ఎవరు రమ్మన్నారు! మీరుచస్తే కాని, దానికి పెళ్ళవదు. ఛీ! ఛీ! యింటావంటాలేని జబ్బొచ్చిపడింది" తండ్రి మీద విరుచుకుపడ్డాడు కృష్ణ.

"మీరు బ్రతికున్నంతకాలం రాధకు పెళ్ళిజరగదు. ఇప్పటికి పది సంబంధాలు పైనే దాటిపోయినయ్" విజయ్ రెండోఅన్న రావు అన్నాడు అక్కసుగా.

"అనండిరా! అనండి! ఏపూర్వజన్మ పాపమో ఈ జన్మలో అనుభవిస్తున్నాను." బలరాంగారు అని, అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. విజయ్ తల పట్టుకుని అలాగే పందిరిరాటకు జేరబడిపోయాడు.

పందిరిలో ఓమూల కుర్చున్న మధుకు యిదంత ఒక సినీమాలా తోచింది. తన వలపులరాణి, విజయ్ చెల్లెలు కావటం! విజయ్ తండ్రికి, కుష్ఠువ్యాధి వుండటం! అదివిని పెళ్ళివారు పీటలు మీదిపెళ్ళి ఆపివెళ్ళిపోవటం! అదీచూసి.

పెళ్ళికూతురు తండ్రికి కుష్ఠువ్యాధయితే ఆమెలో వచ్చిన లోప మేమిటి? మూఢ నమ్మకాలూ, మూఢ తత్వాలూ.

కాకపోతే తనకలాంటి వాటితో ప్రమేయంలేదు. ఎవరినైనా ఒకలాగే చూస్తాడు. వాళ్ళుమాత్రం మనలాంటి మనుషులు కాదా? అనుకున్నాడు మధు.

పెళ్ళి తప్పిపోవటం ఒకందుకు మంచిదే అయింది మధుకు. రాధను తనే పెళ్ళి చేసుకుంటే? అన్న ఆలోచన స్ఫురణకువచ్చింది మధుకు.

ఆఖరుకు ఒక నిశ్చయానికి వచ్చినవాడలా; విజయ్ దగ్గరకు వెళ్ళి బుజంపై చేయివేసాడు. విచారంగా చూసాడు మధు ముఖంలోకి విజయ్.

"విజయ్! ఈసమస్యకు నేనొక పరిష్కారమార్గం ఆలోచించాను. మీ అందరకూ యిష్టమయితే; ముఖ్యంగా మీ చెల్లాయి రాధకు యిష్టమయితే ఇదే ముహూర్తానికి, ఇదే పీటలపై రాధను పెళ్ళి చేసుకుంటాను నిర్భయంగా"

"మధూ!?" తలెత్తిమళ్ళీ ఓసారి మధు ముఖంలోనికి చూసాడు విజయ్.

"త్యాగం చేస్తున్నావా?" అన్నాడు.




"కాదు విజయ్! మనస్ఫూర్తిగా చెబుతున్నాను, మీ రాధను నేను ఈ వూరొచ్చిన క్రొత్తలోనే చూసాను. కాని రాధ నీ చెల్లెలని తెలియదు. రాధలాంటి అందమయిన భార్య దొరికితే...అనుకునే వాణ్ణి" అంతే.

అదే పందిరిమళ్ళీ కళకళలాడింది. క్రితం కూర్చున్న కాళీ పీటలకు నిండుధనాన్ని చేస్తూ మధు, రాధా కూర్చున్నారు. పెళ్ళి నిరాఘాటంగా జరిగిపోయింది. అనుకోని ఈ హటాత్పరిణామానికి అందరి కళ్ళూ ఆనందంతో మెరిసిపోయినయ్. మధు చేసిన ఈ ఔధార్యానికి కృతజ్ఞతతో అమాంతం కౌగలించుకున్నాడు విజయ్.

తన తండ్రిమూలంగా తన జీవితానికి ధుర్భరం తప్పదనుకున్న రాధకళ్ళు అనుకోని ఆనందంతో మెరిసిపోయినయ్.

"మేరేజస్ ఆర్, మేడిఇన్ హెవెన్" అన్న ఇంగ్లీషు సామెతజ్ఞాపకం వచ్చి నిండుగా నవ్వుకున్నాడు మధు. మొట్టమొదట రాధను చూసినప్పుడు తనలో కలిగిన తృష్ణ అనాటితో తీరిపోయింది.

# ఉమ్మడి బ్రతుకులు

రచన:
శ్రీ తమ్మిశెట్టి రామారావు.

తూర్పు తెల్లవారి బారెడు పొద్దెక్కింది. మంచినీళ్ళు పుక్కిలించి వూసి, తూర్పుకేసి తిరిగి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టింది మారమ్మ. "ఓ వుదయలచ్చల తండ్రీ! యియ్యాలైనా ఓ వుత్తరం ముక్కొచ్చేలా దయ చూడయ్యా!" అని భర్త చనిపోయినకాడనుంచి సూర్యుడి దణ్ణం పెట్టడం అలవాటు.

మారమ్మకి యిద్దరు కొడుకులు. పెద్దవాడు వెంకటేశానికి ముగ్గురాడపిల్లలు, ఒక మగపిల్లడు మద్రాసులో ఒక ఫౌండ్రీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. చిన్నవాడు సూర్యానికి ఒక మగబిడ్డడు. మధ్య ప్రదేశ్‌లో ఒక చిట్ ఫండ్ కంపెనీలో టైపిస్ట్‌గా పని చేస్తున్నాడు. సూర్యం ఉద్యోగ రీత్యా మధ్య ప్రదేశ్ వెళ్ళిపోయిన తర్వాత మారమ్మ వెంకటేశం కాడకి చేరింది. ఏణ్ణర్ధం గడచేసరికి మారమ్మ మొహం మొత్తింది. అదిగాక వెంకటేశం చాలీ చాలని బత్తెంతో సతమతమౌతూ, పిల్లల్తో నానా బాధా పడుతున్నాడాయె.

"బాబు! వెంకటేశం ఎన్నాళ్ళనిరా! వున్న వూరు ఇల్లు వదిలేసి వుండడం. పోనీ సూర్యానికి ఆ మూడు ముళ్ళు పడిపోతే కొన్నాళ్ళు వాడి పంచనవుంటే నాదినం ఆలా తీరిపోతుంది." అంది మారమ్మ.

"ఓ అలాగేనమ్మా: తమ్ముడికి వుత్తరంరాసి చూస్తాను. ఏమంటాడో" అన్నాడు వెంకటేశం.

ఆరుమాసాలు గడవకముందే సూర్యానికి మంచి సంబంధం కుదరడం, మారమ్మ కొడుకుతో మధ్యప్రదేశ్ వెళ్ళిపోవడం జరిగింది. కాని మారమ్మకి చిన్న కోడలి మనస్తత్వం నచ్చలేదు. చిన్నకోడలు నాగమణికూడ అత్తని చూసి అసహ్యించుకునేది.

అత్తా కోడళ్ళమధ్య చిరుబొరుకులు పట్టించుకొనే వాడు కాదు సూర్యం. మారమ్మ కొడుకుతో చెప్పి మళ్ళ వున్నవూరు ప్రయాణం కట్టింది.

తల్లిని రైలెక్కిస్తూ ఎలాఎలా బళ్ళుమారాలో వివరించాడు సూర్యం. "నేనంత తెలివితక్కువ దాన్నంట్రా సూర్యం" అంది మారమ్మ.

"నే నొక్కణ్ణి నెలనెలా పాతిక రూపాయలు పంపిస్తానమ్మా! అక్కడే వుండు. అన్నయ్యకి కూడా వుత్తరం రాయించు వాడూ పదో పరకో పంపకపోడు. నీవు నిశ్చింతగా స్వంత ఇల్లు కనిపెట్టుకుని వుండువుగాని. అదేనీకునచ్చుతుంది." అన్నాడు సూర్యం.

పెద్దవాడు మొదట్లో పదో పరకో పంపినా,రాను రాను మానుకున్నాడు. చిన్నవాడు ఎలాగూ పంపుతునే వున్నాడు. పెద్దవాడంటే మారమ్మకి ప్రాణం. పోనిలే పిల్లల్తోనూ, పెళ్ళాంతోనూ వాడు చల్లగావుంటే అదే చాలనుకుంది మారమ్మ. కూలో నాలో ఎలాగూతనకు తప్పలేదు.

మారమ్మకి వయసు పెరుగుతోంది, అలాగే చిన్నవాడి చదువూ, సంధ్యకోసం చేసిన అప్పూ పెరుగుతోంది. ఇంటిమీద అప్పు గురించి ఒకటీ రెండుసార్లు సూర్యానికి రాసింది. కాని సూర్యం ఆమాట పట్టించుకోలేదు పెద్దవాడికి ఎలారాయాలనని వూరుకుంది.

ఇప్పుడు అది పీకల మీది కొచ్చింది. అప్పిచ్చిన శరభయ్య కోర్టులో డిక్రీపొందాడు. రెండ్రోజులనుండి ఇల్లు ఖాళి చేసి పొమ్మని పీధిపెడుతున్నాడు.

మధ్యాహ్నమైంది వుత్తరం కోసం ఎదురుచూస్తోంది మారమ్మ ఇక్కడి పరిస్థితంతా యిద్దరికొడుకులికి రాసింది. ఇద్దరిలో ఎవరొకరు చేరదీస్తే వచ్చేస్తానంది. కాని ఏ ఒక్కరి కాడనుండి ఇంతవరకూ జవాబు కనపడలేదు.

"యియ్యాలైనా వుత్తరం రాకపోద్దా" అని మనస్సులో అనుకొని పోస్టుమేన్ కోసం ఎదురు చూస్తోంది మారమ్మ.

---

వధూవరు లిద్దరూ, బలరాంగారి దగ్గరకు వచ్చారు దీవించమని. ఆనందంతో ఆనందబాష్పాలు రాల్చి, అక్షింతలుజల్లి అలాగే నేలకు ఒరిగి పోయారు బలరాం గారు. అంతే అప్పుడే ఆయన ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

అది చూసి నింగిలో నిశాకరుడు నవ్వుతున్నాడు నిండుగా.